నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

గురువారం
17 ఏప్రిల్
2025
పేజీలు 8

## గుంటూరు పల్నాడు



ఉమ్మడి గుంటూరు జిల్లాలో వాహనాలు, కొన్ని పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాల వల్ల గాలి తీవ్రంగా కలుషితమవుతోంది. ఇప్పటికీ గుంటూరు, పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు ఇంట్లో వంట కోసం కట్టెల పొయ్యిలు విరివిగా వాడుతున్నారు. అయితే, ఇంట్లో వంట కోసం కట్టెల పొయ్యిలు, పిడకలు వంటివి వాడటం వల్ల ఇంటిగాలి గరళంగా మారుతోంది. ఇది మహిళల ఆరోగ్యాన్ని హరించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఇళ్లలో ఉన్న.శిశువులకూ చాలా హాని కలిగిస్తోంది. వాయు కాలుష్యం అనగానే వాహనాలూ, పరిశ్రమల నుంచి, వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ మాత్రమే గుర్తుకొస్తుంది. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాల వల్ల గాలి తీవ్రంగా కలుషితమవుతోంది. అయితే, ఇంట్లో వంట కోసం కట్టెల పొయ్యిలు, పిడకలు వంటివి వాడటం వల్ల ఇంటిగాలి గరళంగా మారుతోంది. ఇది మహిళల ఆరోగ్యాన్ని హరించడంతో పాటు శిశువులకూ చాలా హాని కలిగిస్తోంది...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

# వంటింటి పొగ.. ఆరోగ్యానికి సెగ!



- రాయితీ తగ్గి..
- వాయువా... విషమా.
- పర్యావరణానికి తీవ్ర హాని
- గ్రామాల్లో ఇళ్లలోని పిల్లలకు హాని

వాయు కాలుష్యం అనగానే వాహనాలూ, పరిశ్రమల నుంచి, వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ మాత్రమే గుర్తుకొస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య పుట్టుకొచ్చే ఉద్గారాలు సైతం గాలిని విషతుల్యం చేస్తాయి. ఇదే గృహ వాయు కాలుష్యం అంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు గ్రామీణ కట్టెల పొయ్యి వల్లగృహ వాయు కాలుష్యం నానాటికీ మిగతా 3వ పేజీలో

# ఉల్లాస్ మొదటి ఫేజ్‌లో 10,164 మందికి అక్షరాస్యత

**రెండవ ఫేజ్ లో 30, వేల మందిని అక్షరాస్యులను చేస్తాం**
**పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** 2024-25 లో ఉల్లాస్ (అందరికీ అక్షరాస్యత) కార్యక్రమం మొదటి విడత ద్వారా జిల్లాలో చదవడం, రాయడం రాని 10,707 మందిని అక్షరాస్యులను చేశామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 30,000 మంది విధాన, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులను తయారు చేయాలని బుధవారం అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉల్లాస్ పథకంపై జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. మొదటి ఫేజ్‌లో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రెండవ ఫేజ్ లో పట్టణ ప్రాంతాల్లో సైతం నిరక్షరాస్యులను గుర్తించి తరగతులు నిర్వహించాలన్నారు. ఆ మేరకు మున్సిపాలిటీల్లో ప్రాంతాల్లో ఉల్లాస్ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా లబ్ధిదారులు, జెడ్పీ, మిగతా 3వ పేజీలో






# ప్రధాని పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

- మే 2న అమరావతి పరిధిలో వివిధ శంకుస్థాపనలు
- అధికారులకు విధులు కేటాయింపు
- హెలి ఫ్యాడ్, రోడ్ షో, మీటింగ్‌ల పై అధికారులతో చర్చించిన కలెక్టర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ మే 2వ తేదీన అమరావతి పరిధిలో వివిధ శంఖుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు శ్రద్దపెట్టి విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడి గారి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిఆర్ఓ ఎస్.ఎస్.కె.ఖాజావలిలతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారులకు పర్యటన ఏర్పాట్లపై ప్రభుత్వం విధులు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లా అధికారులకు కూడా వారు చేపట్టవలసిన విధులపై సూచనలు మిగతా 3వ పేజీలో

## ప్రభుత్వ వైద్యశాలలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న రోగులు




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్యశాలలో 30 మంది సిబ్బందికి గాను పదిమంది సిబ్బంది ఉన్నారు. రోగులకు సరైన వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది. విషయాన్ని తెలుసుకున్న పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి శిక్కినం చిన్న. హాస్పిటల్ ను సందర్శించారు. సిబ్బందిని వివరాలు అడగగా హాస్పిటల్ లో మొత్తం 30 మంది సిబ్బంది ఉంటే ఇప్పుడు పది మందే ఉన్నారని 30 మంది పని మేము ఎక్కడ చేశామని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై సూపర్నెంట్ కలవాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి శిక్కినం చిన్న. ప్రయత్నం చేయగా సూపర్నెంట్ మొహం సాటేసి తిరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అదేవిదంగా ఆస్పత్రిలో 3 రోజులు నుండి ఎవరో గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చగా ఆ వ్యక్తికి ఎటువంటి చికిత్స లేకుండా ఒక ఒక మూలన పడేశారు. ఈ విషయం మీద జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో సరైన వసతులు కల్పించాలని బాధితులను మెరుగైన వైద్యం అందించాలని అధికారుల మీద తగు చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి శిక్కినం చిన్న డిమాండ్ చేశారు.

## మద్యం కేసులో ఉన్న వాళ్ళని బొల్లాపల్లి తహశీల్దార్ ముందు బైండోడ్ చేసిన అధికారులు



**ఈపూరు మేజర్ న్యూస్ :** ఈపూరు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామం, రెమిడీచర్ల గ్రామం, గరికపాడు గ్రామంలలో మద్యం కేసులులో వున్న 06 మందిని బొల్లాపల్లి తహసీల్దార్ ఆఫీస్‌లో బైండోవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు ఇన్స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమంగా మద్యం కలిగి ఉండడం, అక్రమంగా మద్యం విక్రయించడం మరియు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్ట రీత్యా నేరం అని తెలపడం జరిగింది.

## నాటు సారా తయారీ స్థావరాలపై ఆకస్మిక దాడులు

- కొత్త పుల్లారెడ్డిగూడెంలో 700 లీటర్ల బెల్లపూట ధ్వంసం.
- 15 లీటర్ల నాటు సారా స్వాధీనం.
- కేసు నమోదు, త్వరలోనే నిందితుల అరెస్టు.
- మీడియా సమావేశంలో ఎక్సైజ్ సీఐ ఎన్ వెంకటరమణ.



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మాచర్ల ఎక్సైజ్ సీఐ మరియు వారి సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారు జామున కొత్తపుల్లారెడ్డి గూడెం పరిసర అటవీ ప్రాంతములో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకున్నట్లుగా ఎక్సైజ్ సిఐ ఎన్ వెంకటరమణ తెలియజేశారు. ఈ సందర్భంగా అక్రమ నాటుసార తయారీకి సంబంధించి కేసు నమోదు చేసి, ముద్దాయిలను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ సీఐ మీడియా సమావేశంలో వెల్లడించారు. అదేవిధంగా అక్రమ నాటు సారా తయారీ మరియు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యానికి సంబంధించి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ దాడులలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ గుంటూరు, పల్నాడు జిల్లాల అధికారులు మరియు మాచర్ల ఎక్సైజ్ ప్రొహిబిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల జారీపై కసరత్తు

- కొత్త రేషన్ కార్డులు వీరికే
- పాతవి రద్దు
- తాజా మార్గదర్శకాలు..!!



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఏపీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ పై కసరత్తు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయాలని నిర్ణయించింది. పథకాల అమలు కోసం రేషన్ కార్డులు ప్రాతిపదిక కావటంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. ఏడాది కాలానికి పైగా రాష్ట్రంలో రేషన్ కార్డులు మంజూరు కాలేదు. అదే సమయంలో అనర్హుల ఏరివేత పైనా ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఇప్పుడు తాజాగా కొత్త రేషన్ కార్డుల మంజూరు.. పంపిణీ పైన ప్రభుత్వ ముహూర్తం ఖరారు అయింది.

**పాత కార్డుల స్థానంలో**

ఏపీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు విషయంలో ఆచి తూచి నిర్ణయం తీసుకుంటోంది. పాత కార్డులను రద్దు చేసి.. వాటి స్థానంలో డిజిటల్ కార్డులను ఇవ్వాలని నిర్ణయించింది. పూర్తిగా భద్రతా ఫీచర్లతో కార్డులు పంపిణీ చేయనున్నారు. క్యూఆర్ కోడ్ తో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిసైడ్ అయ్యారు. కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద సంఖ్యలో లబ్ది దారులు దరఖాస్తు చేస్తున్నారు. కొన్నేళ్లుగా రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు పెండింగ్?లో ఉన్నాయి. కొత్తగా సభ్యుల చేరిక మొదలుకుని ఇప్పటికే మృతి చెందిన, వివాహమై వెళ్లిపోయిన సభ్యుల వివరాలను మార్చడం లేదు. దీంతో అక్కడక్కడా లబ్ధిదారుల విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయి.

**వారి కార్డుల ఏరివేత**

దీంతో, ప్రభుత్వం ఈ కేవైసీ పూర్తి చేసి కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెలాఖరు వరకు ఈకేవైసీ పూర్తి చేయటానికి గడువుగా నిర్ణయించారు. కొత్తగా కార్డుల మంజూరు కు ముందే.. ప్రస్తుతం కార్డులకు అర్హత లేకపోయినా కార్డులు ఉన్నవారికి గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. క్షేత్ర స్థాయి నుంచి వారి వివరాలను సేకరించారు. జూన్ నెల నుంచి కొత్త కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని తాజాగా నిర్ణయించింది. దీంతో, ఈ నెలాఖరు లోగా లబ్దిదారులు తమ కేవైసీ పూర్తి చేయాలని సూచిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన యాప్, రేషన్ షాపులోని ఈపాస్ ద్వారా ఈ కేవైసీఅప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించారు.

**ముహూర్తం ఫిక్స్**

రేషన్ కార్డులో పేరు నమోదైన 5 అంతకంటే తక్కువ వయసున్న చిన్నారులు మినహా అందరూ ఈకేవైసీపీని పూర్తి పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఒకే ఇంట్లో ఉంటూ రెండు నంబర్ల ద్వారా కార్డులు తీసుకున్న వారు, మరణించిన కుటుంబ సభ్యుల పేర్లను తొలగించకపోగా వారి పేరుతో రేషన్ సహా ఇతర సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న నేపథ్యంలో ఈకేవైసీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తి అయితే అనర్హులను ఏరివేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ విధానం వచ్చే నెలలో పూర్తి చేసి.. ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# నరసరావుపేటలో ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ కమిటీ ఆధ్వర్యంలో తనిఖీలు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణ పల్నాడు రోడ్డులోని హొటళ్ళలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. టి స్టాల్ లో వినియోగిస్తున్న లూజ్ పాలు మరియు టి పొడి సాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపారు. ఫ్రిడ్జ్ లో వున్న పెరుగు, మజ్జిగా ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ మరియు బాధంపాల ముగింపు తేదీలను తనిఖీ చేసారు. అలాగే హొటళ్ళలో పరిసరాల శుభ్రత పాటించాలని, ఫ్రిడ్జ్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని, డస్ట్ బిన్ ఏర్పాటు చేసి వాడిన టీ కప్పులను అందులో వేసేలా చూడాలని, టీ తయారు చేసే పాత్రలను ప్రతి రోజు శుభం చేయాలని హొటల్ యజమానులకు తెలియజేసారు. అలాగే వినియోగించే వస్తువుల ముగింపు గడువు ప్రతి రోజు పరిశీలించి గడువు ముగిసిన వస్తువులను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ మీడియతో మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యపాలు కాకుండా ఉండేందుకు రాష్ట్ర సివిల్ సప్లైస్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాలలో తనికీలు నిర్వహించి నిబంధనలు పాటించని హొటళ్ళు మరియు షాపులపై కేసులు రాయటం జరిగిందని, అందులో భాగంగా నరసరావుపేట పట్టణంలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని అన్ని హొటల్స్ మరియు రెస్టారెంటులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కూడా తనిఖీ చేయడం జరుగుతుందని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో వీరితో పాటు ఎ.పి. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర క్రియాశీల కార్యదర్శి కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రామీణాంధ్రప్రదేశ్ పాత్ర కీలకం

## 16వ ఆర్థిక సంఘంతో సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర డిప్యూటీ సీఎం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

'గ్రామీణ ఆంధ్రప్రదేశ్ బలోపేతం దేశానికి అవసరం. వికసిత్ భారత్ అనే మహా లక్ష్యంలో గ్రామీణాంధ్ర ప్రదేశ్ కీలకం. పంచాయతీల స్వయం ప్రతిపత్తి సాధన లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముందుకు వెళ్తోంద'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం, వలసలు అరికట్టడం, ఆహార భద్రత వంటి లక్ష్యాల సాధన సాధ్యపడుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతంలో ఆర్థిక సంఘం సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను పర్యావరణహితంగా, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఆర్థిక సంఘం సహాయ సహకారాలతో పని చేస్తామన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తామంతా కంకణబద్ధులై ఉన్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు 16వ ఆర్థిక సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో 16వ ఆర్థిక సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ డా.అరవింద్ పనగరియా ఇతర సభ్యులతో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ పక్షాన తొమ్మిది అంశాలతో కూడిన ప్రతిపాదనలను ఆర్థిక సంఘం ముందుకు ఉంచారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మహాత్మా గాంధీ చెప్పినట్టు భారత దేశ భవిష్యత్తుకు పల్లెలే పట్టుగొమ్మలు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో గ్రామాలు కీలక పాత్ర పోషిస్తాయన్న నమ్మకం మాకు ఉంది. వికసిత్ భారత్ లో గ్రామాలకు సమాన పాత్ర ఉండాలి. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసికట్టుగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోంది. ఉమ్మడిగా పని చేయడం బరువు కాదు బాధ్యతగా భావిస్తోంది. ప్రతి గ్రామాన్ని డిజిటల్ పంచాయతీగా అభివృద్ధి చేసే లక్ష్యంతో వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయం ఏర్పాటు చేయనున్నాం. దీంతోపాటు వ్యవసాయం, మార్కెట్, రోడ్లు, గ్రామీణ పంపిణీ హబ్ ల ఏర్పాటు, గుంతలు లేని రహదారుల నిర్మాణం ధ్యేయంగా పెట్టుకున్నాము. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఏకీకృత సేవల విధానం సిబ్బంది నియామకాలతోపాటు నైపుణ్య సామర్థ్యాల పెంపుదల, క్షేత్ర స్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా సమూల మార్పులు తీసుకురావడం జరిగింది. ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనుల్లో ప్రజల్ని భాగస్వాములుగా చేయడంతో పాటు ఓ పారదర్శక విధానానికి నాంది పలికాము.

# మాయాబజార్‌కు మంచి రోజులు

- రూ.50 లక్షల తో సిసి రోడ్, సీసీ డ్రైన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన
- వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పనులు చేపడతామని వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గత 15 ఏళ్లుగా తట్టమట్టి కూడా పడని మాయాబజార్ సెంటర్ కు మంచి రోజులు తీసుకొస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని మాయాబజార్ నుంచి ఓల్డ్ క్లబ్ రోడ్డు వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాయాబజార్లోని వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యాపారాలకు, ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని, దీనికి సహకరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా మాయాబజార్ సెంటర్ ను ఇదే విధంగా చూస్తున్నామని, కానీ ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడు లేడని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాయాబజార్ సెంటర్ రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నానని తెలిపారు. ఇందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మేయర్ సజీలా, కార్పొరేటర్ చిష్టి, షౌకత్, కొనకళ్ళ సత్యం, కుదుస్, పద్మావతి, విజయ్, మాయాబజార్ లోని వ్యాపా రస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సివిల్స్ అభ్యర్థులకు శిక్షణకు ఆదివారం ప్రవేశ పరీక్ష : చీఫ్ విప్ జీవీ



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ పట్టణానికి దగ్గరగా అన్నమాట ప్రకారం సివిల్స్ కోచింగ్ స్కాలర్‌షిప్ అందించే విషయంలో కీలక ప్రకటన చేశారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఆసక్తిగల అభ్యర్థులు అందరికీ ఒక ప్రవేశ పరీక్ష నిర్వహించి... ప్రతిభ ఆధారంగా 30నెలలపాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. డా. లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు. బుధవారం ఈ మేరకు మీడియాతో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు పూర్తి వివరాలు వెల్లడించారు. వినుకొండలో ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ,బీసీ మహిళా అభ్యర్థుల్లో ప్రతిభ ఉన్నవారిని 10మందిని ఎంపిక చేసి శివశక్తి ఫౌండేషన్ తరపున ఉచితంగా శిక్షణ ఇప్పిం చడం జరుగుతుందన్నారు. వారికి వసతి, భోజనం సహా అన్ని ఏర్పాట్లు ఉచితంగానే చేస్తామ న్నారు. ఆదివారం అందుకు సంబంధించిన పరీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడిచారు. వినుకొండ పట్టణం కురిచేడు రోడ్డులోని సీతారామపురం బనవోలు దగ్గర ఉన్న డా. లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ భవనంలో ఆ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారంతా ఆదివారం పరీక్షకు హాజరు కావొచ్చని తెలిపారు. పరీక్షలో మంచి మార్కులు వచ్చిన వారికి సివిల్స్, గ్రూప్ పరీక్షలకు కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8639379369 అనే నంబర్‌లో సంప్రదించాలని లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ నిర్వాహకులు తెలిపారు.

# వంటింటి పొగ... ఆరోగ్యానికి సెగ!

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిపోతోందని, గృహిణులు అధికస్థాయిలో బ్లాక్ కార్బన్ కాలుష్య ప్రభావంతో ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఇటీవల 'ఇండియా క్లీన్ ఎయిర్ సమ్మిట్-2024'లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించారు. దేశవ్యాప్తంగా వెలువడుతున్న మొత్తం కర్బన ఉద్గారాల్లో ఇళ్ల వాటా 20-40శాతమని, నగరాల్లో కంటే గ్రామాల్లోనే గృహ వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటోందని ఆమె ఆందోళన వ్యక్తంజేశారు.

దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది ఇప్పటికీ వంట కోసం కట్టెలు, బొగ్గులు, పిడకలు వంటి ఘన, జీవ ఇంధనాలనే ఎక్కువగా వాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది కాలుష్య కారక వంటచెరకునే వినియోగిస్తున్నారు. ఇటీవల ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు కూడా వెల్లడించింది. 2015 నాటికే ప్రపంచవ్యాప్తంగా అందరికీ తక్కువ ధరకు సుస్థిర, ఆధునిక ఇంధనం అందుబాటులోకి రావాలన్నది ఐరాస లక్ష్యం. పలు దేశాలు ఇప్పటికీ ఆ దిశగా ముందుకు సాగడంలేదని ఐరాస ఆవేదన వ్యక్తం చేసింది. భారత్‌లోనూ ఎంతో మంది వంటలకు స్వచ్ఛమైన ఇంధనం వాడటం లేదు. ఘన, జీవ ఇంధనాల మూలంగా మహిళలు ఊపిరితిత్తులు, గుండె, కాలేయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. క్యాన్సర్లు సైతం ఎక్కువ అవుతున్నాయి. గృహ వాయు కాలుష్యం గర్భిణుల ఆరోగ్యం, కడుపులోని బిడ్డలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా అతి సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5), వంట పొగ కారణంగా 2019లో దాదాపు 60 లక్షల మంది శిశువులు నెలలు నిండకముందే జన్మించారని, 30 లక్షల మంది తక్కువ బరువుతో పుట్టారని కాలిఫోర్నియా వర్సిటీ అధ్యయనం వెల్లడించింది. గృహ వాయు కాలుష్యం మూలంగా నవజాత శిశు మరణాలు సైతం సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఏటా 32 లక్షలకు పైగా మరణాలు గృహ వాయు కాలుష్యం వల్లనే సంభవిస్తున్నాయి. వారిలో అయిదేళ్లలోపు చిన్నారులు రెండు లక్షలకు మించి ఉంటున్నారు. వంట పొగతో మహిళల ఆరోగ్యం గుల్లవడంతోపాటు పర్యావరణానికీ తీవ్ర హాని కలుగుతోందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకాన్ని ప్రారంభించింది. 2023 మార్చి నాటికి దేశంలో 10 కోట్లకు పైగా కుటుంబాలు ఎల్‌పీజీ కనెక్షన్లు పొందగా.. వాటిలో దాదాపు 50శాతం ఒక్కసారి కూడా సిలిండర్‌ను తీసుకోలేదని పరిశీలనలు చెబుతున్నాయి. అంటే- గ్యాస్ పొయ్యిలు ఉన్నా, ఎంతోమంది వంట కోసం ప్రమాదకర ఘన, జీవ ఇంధనాలనే ఉపయోగిస్తున్నారని అర్థమవుతోంది. పల్లెల్లో కొందరు వంటకోసం గ్యాస్ స్టౌలు వాడుతుంటే, నీరు కాచుకోవడానికి మాత్రం కట్టెల పొయ్యిలనే వినియోగిస్తున్నారు.

**రాయితీ తగ్గి...**

ఘన, జీవ ఇంధన వినియోగం భవిష్యత్తులో మానవాళి ఆరోగ్యానికి పెను ముప్పుగా పరిణమించ నుందని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ, శాస్త్రీయ- పారిశ్రామిక పరిశోధనా మండలి, ఇంధన వనరుల సంస్థ (టెరి) ప్రత్యేక మార్గదర్శకాలను వెలువరించాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పెరుగుతున్న సిలిండర్ ధరలు, రాయితీల్లో కోత తదితర కారణాలతో పీఎంయూవై లబ్ధిదారులు చాలామంది మళ్లీ పాత పద్ధతులకే మళ్లుతున్నారు. ప్రభుత్వాలు రాయితీలు పెంచి పేద కుటుంబాలపై ధరాభారాన్ని తగ్గించాలి. కట్టెలు, బొగ్గు, పిడకల వినియోగం వల్ల పెరిగే కాలుష్యం, ఆరోగ్యానికి అవి కలగజేసే ప్రమాదాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. ఎల్‌పీజీ సిలిండర్లను వాడేలా ప్రజలను ప్రోత్సహించాలి.

**వాయువా.. విషమా?**

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం గాలిలో అతి సూక్ష్మ ధూళికణాలు (పీఎం2.5) ఘనపు మీటరుకు అయిదు మైక్రోగ్రాములకు మించకూడదు. నిరుడు చాలా దేశాల్లో అవి నిర్దేశిత ప్రమాణాలకన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా పోగుపడ్డాయి. అతి సూక్ష్మ ధూళికణాల సగటు సాంద్రత అత్యధికంగా ఉన్న దేశాలు ఏవంటే..

## ఉల్లాస్ మొదటి ఫేజ్‌లో 10,164 మందికి అక్షరాస్యత

(మొదటి పేజీ తరువాయి)

మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది, అంగన్ వాడీ సహాయకులు, ఉపాధి హామీ కూలీలలో నిరక్షరాస్యులను గుర్తించి నమోదు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా అధికారులు ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక విద్యా వాలంటీర్ చొప్పున నియామకాలు చేపట్టాలన్నారు. ఆఫ్ లైన్, ఆన్ లైన్ విధానాల్లో తరగతులు నిర్వహించి జిల్లాలోని ప్రతి ఒక్కరూ రాయడం, చదవడం, ఆర్థిక లావాదేవీలు చేయగలిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య అధికారి జగన్ మోహన్ రావు, డీఈవో చంద్రకళ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, గ్రామ %డ% వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులతో విధుల నిర్వహణపై సూచనలు జారీ చేసినపుడు వారి సూచనలను అధికారులు తప్పక పాటించాలని సూచించారు. భారత ప్రధాని గుంటూరు జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వారికి కేటాయించిన విధులను తూ.చా తప్పకుండా పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. భారత ప్రధాని బహిరంగ సభలో పాల్గొనే ముందు రోడ్డు షో వుంటుందని , అందుకు తగ్గ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాల్సి వుందన్నారు. సెక్యూరిటీ పరంగా అన్ని భద్రతా చర్యలు చేపట్టలని సూచించారు. కార్యక్రమం జరిగే ప్రాంత్రమంతా కూడా శానిటేషన్ చక్కగా వుండాలని ఇందుకు డిపిఓ మరియు యంటియంసీ కమిషనర్ సమన్వయంతో అవసరమైన సిబ్బందిని కేటాయించుకుని శానిటేషన్ చక్కగా చేపట్టాలన్నారు. అలాగే హెలిప్యాడ్ , పబ్లిక్ మీటింగ్ , రోడ్డు షో ప్రాంతాల్లో చక్కటి శానిటేషన్ వుండాలన్నారు. ప్రాంగణం అంతా కూడా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సభా ప్రాంతంలో ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లతో పాటు మంచి నీరు , స్నాక్స్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూట్ ప్లాన్ పై అధికారులందరు కూడా అవగాహన కలిగి వుండి వాహనాల రాకపోకలు , ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు అయ్యే వరకు నిరంతరం విద్యుచ్ఛక్తి సరఫరా వుండేటట్లు విద్యుత్ శాఖఅధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బ్యారికేట్ పనులు చాలా చక్కగా చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కు ఐదు ప్రాంతాలను గుర్తించడం జరిగిందని , ఆ పార్కింగ్ ప్రాంతంలోనే వాహనాలు నిలుపదల చేసి వుంచాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలకు మొబైలు టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భారత ప్రధాని పాల్గొనే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నందున అందుకు తగ్గ క్రౌడ్ మేనేజ్మెంట్ పాటించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారు సురక్షితంగా తిరిగి వారి గమ్య స్థానానికి చేరుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ప్రధాని కార్యక్రమానికి పక్షం రోజుల సమయం వుందని తాత్సారం చేయకుండా ఇప్పటి నుండే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుప్రజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జెడ్ పీ సిఇఓ జ్యోతిబసు, డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మీ, పీడీ డ్వామా శంకర్, ఎస్. ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, డిఇఓ రేణుక, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, డీడీ హార్టికల్చర్ రవీంద్ర , డీడీ గ్రౌండ్ వాటర్ వందనం, జెడి అగ్రికల్చర్ వెంకటేశ్వర్లు, పీడీ హౌసింగ్ ప్రసాద్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిరంగిపురం నూతన సీఐగా శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** ఫిరంగిపురం నూతన సీఐగా కె. శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిఐడి డిపార్ట్మెంట్లో పనిచేస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిరంగిపురం సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిరంగిపురం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, గంజాయి, అక్రమ బెల్ట్ షాపులు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నూతన సీఐ కి శుభాకాంక్షలు తెలిపారు.

# బి.ఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికుడు

## జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :**
దేశవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలు ఈనెల 25 వరకు బిజెపి ఆధ్వర్యంలో జరుపుతున్న సందర్భంగా బుధవారం బిజెపి గుంటూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేద్కర్ ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేట 15/3 లో ఉన్న ఎస్సీ మోర్చా కార్యాలయంలో పేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా బిజెపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు హాజరైనారు. తిరుపతిరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికుడని, ప్రధాని నరేంద్రమోడీ అంబేద్కర్ జీవిత విశేషాలు ను పంచ తీర్థ్ అనే కార్యక్రమం ద్వారా అంబేద్కర్ కీర్తిని ప్రపంచ దేశాలకు తెలియజేసేలా చేశారన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక కులాని కో ఒక మతానికి చెందిన వారు కాదని వారు ప్రపంచ మేధావి అని వారి పేరు మీదుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని అన్నారు. అనంతరం పేదలకు నిత్యవసర సరుకులైన బియ్యం, కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ రామకృష్ణ, మంత్రి సుగుణ, వక్కలగడ్డ తిరుమలరావు, పెద్దింటి కృష్ణచైతన్య, బూసి స్టాలిన్, మంచళ్ళ అశోక్, మోతే శేషగిరిరావు, రమాదేవి, వెలగలేటి గంగాధర్, చంద్రశేఖర్, పార్టీ క్రియాశీల సభ్యులు రమణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు




నూజెండ్ల మేజర్ న్యూస్: మండలంలోని పెద్దవరం గ్రామ పాఠశాల ప్రార్ధనా సమయంలో సంఘసంస్కర్త, రచయిత,కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు నివాళులర్పించారు . పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు వీరేశలింగం గురించి పిల్లలకు తెలుపుతూ ఆ కాలంలోని దురాచారాలు అయిన కుల వ్యవస్థ, బాల్య వివాహాలను రూపుమాపటానికి కృషి చేశారు. వితంతువుల పునర్వివాహాలను, స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు. ఆయన ఎల్లప్పుడూ పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేవారు. "చిరిగిన చొక్కా నైనా తొడుక్కో కాని, మంచి పుస్తకం కొనుక్కో" అన్న ఆయన మాటలను విద్యార్థులకు గుర్తు చేస్తూ మీరు కూడా ఎల్లప్పుడూ మంచి పుస్తకాలను చదువుతూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్జీలు పరిష్కారాన్ని అధికారులు బాధ్యతగా తీసుకోవాలి : చీఫ్ విప్ జీవీ

**వినుకొండ, మేజర్ న్యూస్:**
ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. ప్రజల ఇబ్బందులు తీర్చడమే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమని, ఆ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. వినుకొండ పట్టణంలోని చీఫ్‌విప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను నేరుగా విన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ, డ్రైనేజీ, నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఎక్కువగా వినతులు వచ్చాయన్నారు. మొత్తం 94 అర్జీలు స్వీకరించామని తెలిపారు. వీటి అన్నింటినీ పరిశీలించి, పరిష్కారాలు సూచించామన్నారు. నీటి సమస్యలు, డ్రైనేజీ బ్లాకేజీపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి భూ రికార్డులు సరిచేయడంపైనా వేగంగా స్పందించాలన్నారు.



కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల్లో పల్నాడు ప్రాంత కరవు తీర్చడం ప్రధానంగా ఉందని.. ప్రతి గ్రామంలో సాగునీరు, తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజల నమ్మకమే కూటమి ప్రభుత్వం బలమని, వారి సమస్యలు పరిష్కరించ డం ద్వారా వినుకొండ నియోజకవర్గం మొత్తాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

# అన్నాక్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

**గుంటూరు, మేజర్ న్యూస్ :**
అన్నాక్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పల్నాడు బస్టాండ్ వద్ద గల అన్నా క్యాంటీన్ ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని 7అన్నా క్యాంటీన్ల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా స్థానిక ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. క్యాంటీన్ నుండి వచ్చే ఆహార వ్యర్థాలు నేరుగా డ్రైన్ లోకి రాకుండా మెష్ లు ఏర్పాటు చేసుకోవాలని అక్షయపాత్ర సిబ్బందికి సూచించారు. క్యాంటీన్ కు వచ్చే ప్రజలు తమ అభిప్రాయాలను క్యాంటీన్ లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియచేయవచ్చని పేర్కొన్నారు.



# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు పంపిణీ



దుగ్గిరాల, మేజర్ న్యూస్. దుగ్గిరాల మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి పి.శిరీష తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద తైవాన్ స్ప్రేయర్లు సబ్సిడీపై అందజేశారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్, వైస్ ఎంపీపీ చైతన్య , ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షురాలు కే.సంనేని శ్రీ అనిత, జనసేన మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, వెనిగళ్ళ శ్రీ కృష్ణ ప్రసాద్, గూడూరు వెంకటరావు, టి.రామకృష్ణ, ఈ మని సర్పంచ్ ఉజ్వల హరిణి పాల్గొని రైతులకు స్ప్రేయర్లు, గొర్రు పనిముట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ ఏ. శ్రీనివాసరావు, ఎంఏఓ పి. శిరీష, ఏఈఓ.రమేష్, డిప్యూటీ ఎంపీడీవో కే.జవహర్లాల్ నెహ్రూ, చుండూరు ఉమామహేశ్వరరావు, దివ్య శ్రీ,తదితరులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఈపూరు మేజర్ న్యూస్: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని శ్రీ ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గడిపుడి నరసింహారావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో శ్రీ ధనలక్ష్మి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్న తమ కళాశాల విద్యార్థులు ఈనెల 12వ తేదీన విడుదలైన జూనియర్ సీనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాలలో జూనియర్ ఇంటర్ సీఈసీ గ్రూపు నందు నందిగం శోభారాణి, సీనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపు నందు మాయకుంట కావ్య అశ్విని, మేకల బాలచంద్రశేఖర్, పూజల గోపి చంద్రశేఖర్ సిఇసి గ్రూపు నందు చాట్ల సన్నీ, చాట్ల ఏసోబులు అత్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ గడిపుడి నరసింహారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా వారు తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవడానికి మరియు సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా మారడానికి సహాయపడు తుందన్నారు.



అనంతరం తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులను కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ మెదరమెట్ల రామశాసగిరి రావు అధ్యాపకులు, కళాశాల సిబ్బంది అభినందించారు.

# మజ్జిగ పంపిణీ కార్యక్రమం



మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్: మాచర్ల పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న చలివేంద్రం నందు కంభంపాడు వీఆర్ఏ దానయ్య తన తండ్రి సీయోను జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టదలిచాడు. అయితే ఈ కార్యక్రమాన్ని మాచర్ల తాసిల్దార్ బి. కిరణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించాలని వీఆర్ఏ దానయ్య కోరగా ఎమ్మార్వో చలివేంద్ర వద్దకు వచ్చి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ దానయ్య తన తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ వేసవి కాలంలో మంచినీరుతోపాటు మజ్జిగ కూడా ప్రజలకు అందించడం ఎంతో అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ అనిల్ కుమార్, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు హిందూ ఫార్మసీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :

అమరావతి రోడ్డు లో ఉన్న హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ సిల్వర్ జూబ్లీ... యాన్యువల్ డే సెలబ్రేషన్స్ గురువారం సాయంత్రం 5 గంటలకు జరగనున్నాయని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి నాగభూషణం తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలోని సమావేశ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశములో సిల్వర్ జూబ్లీ.. యాన్యువల్ డే సెలబ్రేషన్స్ కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి నాగభూషణం మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు జరిగే హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ సిల్వర్ జూబ్లీ, యాన్యువల్ డే సెలబ్రేషన్స్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా రానున్నట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీ సూకల మధుకర్, హిందూ



కళాశాల ఆఫ్ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు గెస్ట్ ఆఫ్ హానర్ గా పాల్గొంటారని ఆయన అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# గుడిపూడిలో రెండో విడత భూమి రీసర్వే

సత్తెనపల్లి మేజర్ న్యూస్:

మండలంలోని గుడిపూడి గ్రామం నందు రెండవ విడత రీ-సర్వే ను తహశీల్దార్ K.S.చక్రవర్తి ప్రారంభించారు. అనంతరం భూమి పూజ చేసి, ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ, బ్రిటిష్ కాలంలో చేపట్టిన భూ సర్వేను తిరిగి సుమారు 115 సంవత్సరముల తరువాత ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరలా రీ-







సర్వే జరుగుతున్నదని తెలిపారు. భూ వివాద ముల పూర్తి ప్రక్షాళనములకు రీ - సర్వే ఉపయోగపడుతుందని, ప్రతి రైతు వారి హక్కు పత్రములతో వారి సర్వే నంబర్లలో సర్వే జరుగుచున్నప్పుడు హాజరై తమ భూ-సమస్యలు పరిష్కారించుకోనవలసినదిగా కోరారు. గ్రామ సభ నందు జరిగిన రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్, ఎన్.రవికుమార్, ఆర్ ఐ బి.బోసుబాబు,మండల సర్వేయర్ విజయ్, గ్రామ పెద్దలు, లగడపాటి గజానన,సర్పంచ్ T.తిరుపతిరావు, MPTC.మర్రి పూర్ణయ్య, గద్దే ఆంజనేయులు, కోసకంచి పుల్లారావు, గ్రామ పెద్దలు, సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులు,రైతులు పాల్గొని యున్నారు.

# ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ కమిటి ఆధ్వర్యంలో తనిఖీలు

నరసరావుపేట మేజర్ న్యూస్ :-

పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణ పల్నాడు రోడ్డులోని హొటళ్ళలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. టి స్టాల్ లో వినియోగిస్తున్న లూజ్ పాలు మరియు టి పొడి సాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపారు. ఫ్రిడ్జ్ లో వున్న పెరుగు, మజ్జిగా ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ మరియు బాధంపాల ముగింపు తేదీలను తనిఖీ చేసారు. అలాగే హొటళ్ళలో పరిసరాల శుభ్రత పాటించాలని, ఫ్రిడ్జ్ లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసుకోవాలని, డస్ట్ బిన్ ఏర్పాటు చేసి వాడిన టీ కప్పులను అందులో వేసేలా చూడాలని, టీ తయారు చేసే పాత్రలను ప్రతి రోజు శుభం చేయాలని హొటల్ యజమానులకు తెలియజేసారు. అలాగే వినియోగించే వస్తువుల ముగింపు గడువు ప్రతి రోజు పరిశీలించి గడువు ముగిసిన వస్తువులను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యపాలు కాకుండా ఉండేందుకు రాష్ట్ర సివిల్ సప్లైస్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాలలో తనికీలు నిర్వహించి నిబంధనలు పాటించని హొటళ్ళు మరియు షాపులపై కేసులు రాయటం జరిగిందని,



అందులో భాగంగా నరసరావుపేట పట్టణంలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని అన్ని హొటల్స్ మరియు రెస్టారెంటులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కూడా తనిఖీ చేయడం జరుగుతుందని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో వీరితో పాటు ఎ.పి. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర క్రియాశీల కార్యదర్శి కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు...

# అమానుషంగా హత్యాచారం చేసి, హత్య చేశారు: బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ మేజర్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి. రాష్ట్ర హొం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనిత కి. రాష్ట్ర డిజిపి కి బహిరంగంగా లేక రాయనున్నరు. వినుకొండ పట్టణం లోని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. గత పది నెలల క్రితం వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామంలో ఒక మహిళను అమానుషంగా హత్యాచారం చేసి, అనంతరం బురదగుంటలో వేసి తొక్కి హత్య చేశారని, ఇంతవరకు ఆ హత్య చేసినవారికి పట్టుకోలేకపోయారని, ఇది పోలీసుల అసమర్థత, ప్రభుత్వ చేతకాని తమని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎన్ని సార్లు పోలీసుల చుట్టూ పోలీస్ ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి మొరపెట్టుకున్న ఫలితం మాత్రం సూన్యం అని అన్నారు. ఈ కేసులో హంతకులకు శిక్ష పడి, హత్యకు గురైన కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాడుతానని అన్నారు. ఈ పోరాటంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారాచంద్రబాబు నాయుడుకి మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, రాష్ట్ర హొం శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనితకి, రాష్ట్ర డిజిపికి బహిరంగంగా లేక రాసారు ప్రకటించారు.



# ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి

## - ఎమ్మెల్సీ ఆలపాటి



తెనాలి, మేజర్ న్యూస్

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రతి బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ముందుగానే వెల్లడించడంతో ప్రజలు తమ సమస్యలు విన్నవించుకోవడాని పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ ఆలపాటి వారికి హామీ ఇచ్చారు.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



పిడుగురాళ్ల మేజర్ న్యూస్: పిడుగురాళ్ళ మండలం తుమ్మలచెరువు గ్రామానికిచెందిన వ్యక్తిఆత్మహత్యాయత్నానికి పాల్పడగా రక్షించిన పోలీసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన వనపర్తి ప్రసాద్(33సం) కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రిఇంట్లోనుండి వెళ్ళిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నానని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియచేసినట్లు తెలిపారు. దీనితో కుటుంబ సభ్యులు విషయాన్ని డయల్100కు సమాచారం ఇవ్వగా జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసు బృందం తుమ్మలచెరువు గ్రామం పంపినట్లు తెలిపారు. పట్టణ సీఐ వెంకట్రావు సూచనలతో యస్ ఐ మోహన్ పోలీస్ బృందంతో సాంకేతికత ఆధారంగా తుమ్మల చెరువు స్టేషన్ కు ఇరువైపులా గాలింపు చర్యలు చేపట్టారు. తమ్మలచెరువు ఊరి చివర రైలు పట్టాల వద్ద పోలీస్‌లు ప్రసాద్‌ను గుర్తించి, అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ పుత్రుడిని క్షేమంగా అప్పగించిన పిడుగురాళ్ల పోలీసు వారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# జల జీవనకు గండం..

## - కాలగర్భంలో కలిసేందుకు సిద్ధంగానున్న పైపులు



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : జలజీవన్ కు గండం ఏర్పడింది .కోట్లాది రూపాయల బిల్లులు చెల్లించినందున, సిద్ధంగా నున్న పైపులు ఎండ తీవ్రతకు పాడై కాలగర్భంలో కోట్లాది రూపాయలు విలువచేసే పైపులు సిద్ధంగా పడి ఉన్నాయి. మండలంలోని గ్రామాల ప్రజలకు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కులాయి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమానికి గండం ఏర్పడింది. జలజీవన్ మిషనుకు నీటి గండం, నిధులు గండంతో పాటు గత వైసిపిప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారుగా ఏడాది కాలం అవుతున్నప్పటికీ జలజీవన్ మిషన్కు గండాలు తొలగిపోక దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో ఉంచిన పైపులు వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండి బక్క చిక్కిపోతున్నాయి.పనులు పూర్తి అయితే పైపులు సురక్షితంగా ఉండేందుకు అను కూలంగా ఉంటుందని దీనికి భిన్నంగా ఆరు బయట పడడంతో పైపులు పాడయ్యేందుకు సిద్ధపడి , మాపై కాస్తంత జాలి చూపించండ0టూ అధికారులను కోరుకుంటున్నాయి. మండలంలోని 18 గ్రామాలకుగాను 16 గ్రామాల్లో అమలు చేసేందుకు గాను 11 ట్యాంకులు నిర్మాణాలు చేయవలసి ఉండగా, ఆరు ట్యాంకులు నిర్మాణాలు జరిపినట్లు తెలియ వస్తుంది. మండల వ్యాప్తంగా ఇంటింటికి రమార మి 20,000వేల.కనెక్షన్లకు సిద్ధం చేసిన పైపులు నీరసపడి పోతున్నాయి .మండల పరిధిలోని ఐదు ఆరు గ్రామాలకు హెడ్ ట్యాంకులు ముగింపు దశకు రానుండగా నగదుచెల్లింపు జాప్యంతో జల జీవన్ మిషన్కు బ్రేకుపడింది. కొన్ని గ్రామాల్లో పనుల లో పురోగతిలేక పైపుల పరిస్థితి ఎక్కడ వేసిన గంగలి అక్కడనే ఉండడంతో కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతుంది .కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి జలజీవన్ మిషన్కు ఏర్పడిన అడ్డు నుతొలగించి సకాలంలో ఇంటింటికి కులాయి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేసే ప్రక్రియలో హైస్కూల్లో నిల్వ ఉంచిన పైపులను వినియోగించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు.

# కళ్యం టౌన్షిప్ లో అగ్నిమాపక వారోత్సవాలు

## కె శ్రీనివాసరావు అగ్నిమాపక అధికారి



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : అగ్ని మాపక వారోత్సవాలు మూడవ రోజు సందర్భంగా బుధవారం రోజు కళ్యం టౌన్ షిప్ లోని బాలాజి టవర్స్ అపార్ట్మెంట్ లో గ్యాస్ ఫైర్స్ ,ఎలెక్ట్రిక్ ఫైర్స్ నందు అవగాహన కల్పించి అపార్ట్ మెంట్ లో అగ్ని ప్రమాదాలు జరిగితే లిఫ్ట్ లో తీసుకోవలసిన జాగ్రత్తలు అగ్నిమాపక అధికారి కె శ్రీనివాసరావు వివరిస్తూ.. అపార్ట్మెంట్లో అగ్ని ప్రమాదం జరిగితే, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటం, భవనము నుండి త్వరగా బయటకు వెళ్లడం చాలా ముఖ్యం అన్నారు. పొగను పీల్చకుండా మెట్లు ద్వారా త్వరగా బయటకు వెళ్ళటం ఉత్తమం. లిఫ్టు ఉపయోగించకూడదు. అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవలసిన చర్యలు: 1, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వండి, మీ స్థానిక అగ్నిమాపక సిబ్బంది నెంబర్ లేదా అత్యవసరం నెంబర్ (100,112) కు ఫోన్ చేయండి ప్రమాదం జరిగిన స్థలం మీ అపార్ట్మెంట్ పేరు, నెంబరు స్పష్టంగా చెప్పండి.2, భవనం నుండి త్వరగా బయటకు వెళ్ళండి: లిఫ్ట్ ఉపయోగించకండి. లిఫ్ట్ లో పొగ, మంటలు ఉండవచ్చు, అందువల్ల మెట్ల ద్వారా బయటకు వెళ్లడం ఉత్తమం. మీరు గదిలో ఉంటే తలుపును మూసి తలుపును తాకి చూడండి. వేడిగా ఉంటే, దాన్ని తెరవకండి. పొగ ఉన్నట్లయితే కిందకు వాలి పొగ కిందకు వెళ్లి బయటికి వెళ్ళండి. భవనం నుండి బయటకు వచ్చిన తరువాత, అగ్నిమాపక సిబ్బంది కి, ఇతర సహాయక సిబ్బందికి సహకరించండి.3, భద్రతా చర్యలు: అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, పొగ పీల్చకుండా చూసుకోవడం ముఖ్యం. పొగను పేల్చడం వల్ల ప్రాణానికి ముప్పు తలెత్తవచ్చు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, మీ ఇంటిలోనే ప్రతి ఒక్కరూ భద్రతను పాటించాలని తెలుసుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగిన తరువాత, మీ భవనంలోని భద్రత సిబ్బంది అధికారులతో సంప్రదించండి.4, అగ్ని ప్రమాదం నివారణ: మీ ఇంట్లో అగ్నిమాపక పరికరాలు ఉంచుకోవడం మంచిది. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు, మీరు త్వరగా స్పందించడానికి అగ్నిమాపక పరికరాల గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఒక సెన్సార్లు, ఇతర అగ్ని ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు మీ ఇంట్లో ఉండాలి. ఇలా సురక్షిత మార్గాలు ద్వారా ఒకరినొకరు ఏవిధంగా రక్షించుకోవాలో అవగాహన కల్పించటమైనది. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక అధికారి కె శ్రీనివాస రావు, యస్ శ్రీనివాస రెడ్డి, పివి సుబ్బారావు , షేఖ్ టి ఎ బాద్షా, సిహెచ్ పిచ్చయ్య, బి వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక: కన్నా




సత్తెనపల్లి మేజర్ న్యూస్: పట్టణం రఘురామ్ నగర్ కన్నా కార్యాలయం నందు నిర్వహించిన. ప్రజావేదిక కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వేదికను ప్రజలందరూ ఉపయోగించుకొని వారి సమస్యలను పాలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా వేదికలో ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకుంటామన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని సత్వరమే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

# కెఎల్ యులో అంతర్జాతీయ సదస్సు




**తాడేపల్లి, మేజర్ న్యూస్:**

వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో ఐసిఈఈఎస్ –2025 ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టెన్ బిలిటీ అంతర్జాతీయ సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు చెన్నై అన్నా యూనివర్శిటీ డీన్ డాక్టర్ ఆర్.జయవేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నానోమెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి పెట్టాలన్నారు. ఎనర్జీ స్టోరేజ్, ట్రాన్సిస్టర్లపై ఫోకస్ చేయడం వంటి అంశాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. సదస్సుకు విద్యా, పరిశోధన, పరిశ్రమ రంగాల నుండి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సుకు రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు ముఖ్య వక్తలుగా వ్యవహరించి అధ్యక్షోపన్యాసం చేశారు. ఆన్ లైన్ ద్వారా తమిళనాడులోని చెన్నై కు చెందిన ఎఎంఇటి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వి. రాజేంద్రన్ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే ఎలక్ట్రానిక్ వ్యవస్థల అవసరాన్ని వివరించగా, గుజరాత్ లోని వడోరాకు చెందిన జిఎస్ఎఫ్ సి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. ఆర్. సిన్హా సుస్థిర అభివృద్ధిలో నైతిక పాత్ర గురించి ఆన్ లైన్ ద్వారా తెలియజేశారు. అనంతరం ఐఆర్ డి విభాగాధిపతి డాక్టర్ వి. విశ్వనాథ్ షెనోయ్ సదస్సు లక్ష్యాలను గురించి వివరించారు.ఈ అంతర్జాతీయ సదస్సుకు అడ్వాన్స్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్ ఆర్ఎఫ్) ఆర్థిక సహకారం అందించినట్లు ఆయనతెలిపారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి 400కు పైగా పరిశోధన పత్రాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వాటిలో 225 అబ్స్ట్రాక్టు ఎంపికయ్యాయని అన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పోస్టర్ ప్రదర్శన సెషన్ ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. వివిధ విద్యా సంస్థల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పరిశోధనలను ప్రదర్శించారన్నారు. . ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విధ్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, ఐఆర్ డి విభాగాధిపతి డాక్టర్ వి. విశ్వనాథ్ షెనోయ్, ఐఆర్ డి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. వివేకానందన్, ఇఎల్ జిఇ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అరుణ్ మేథా, ఎన్ ఐటి, ఐఐటి వంటి జాతీయ విద్యా సంస్థల నుండి, ఇతర దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్ట సవరణ బిల్లురద్దు చేయాలని కోరుతూ శాంతి ర్యాలీ..

పిడుగురాళ్ల మేజర్ న్యూస్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం శాంతియుత ర్యాలీ నిర్వహించాలని పిడుగురాళ్ల ముస్లిం క్రైస్తవ బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జాక్ )పిలుపునిచ్చారురూ. శుక్రవారం మధ్యాహ్నం జుమ్మా తర్వాత శాంతి ర్యాలీ జరుగుతుందన్నారు. జానపాడు రోడ్ లోని ఏడుకోట్ల సెంటర్ నుండి తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పిడుగురాళ్ల మండలంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ముస్లిం సోదర సోదరీమణు లందరూ పాల్గొని శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని పిడుగురాళ్ల జేఏసి వారు కోరారు.

# రూ.7.50లక్షల విలువైన హైడ్రో గంజాయి స్వాధీనం

## -ముగ్గురు నిందితుల అరెస్ట్

## -కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

హైడ్రో గంజాయిని వినియోగించడం తో పాటు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.7.50 లక్షల విలువైన 500 గ్రాముల హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. హైడ్రో గంజాయి రవాణా అవుతుందనే పక్కా సమాచారంతో గుంటూరు జిల్లా పోలీస్, ఈగల్ టీమ్ సంయుక్తంగా కాజ టోల్ ప్లాజా వద్ద డెకాయ్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. హైడ్రో గంజాయి రవాణా కు పాల్పడిన వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఇందుకూరి రామకృష్ణ రాజు, విశాఖ పట్టణానికి చెందిన పురుగంటి అనిల్ కుమార్, నాగరాజు శ్రీహర్ష వర్ధన్ వర్మ అనే నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.7.50లక్షల విలువైన హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు కార్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందుకూరి రామకృష్ణ అనిల్ కుమార్ కు సంక్రాంతి పండుగ సందర్భంలో పరిచయం ఏర్పడి స్నేహంగా మారిందని తెలిపారు. వీరిరువురి కీ బెంగుళూరుకు చెందిన యువకులతో పరిచయం ఏర్పడి అక్కడి నుంచి 500 గ్రాముల హైడ్రో గంజాయిని విశాఖపట్నం తీసుకు వెళుతుండగా మార్గ మధ్యలోని కాజ టోల్ ప్లాజా వద్ద స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైడ్రో గంజాయిని విక్రయించిన బెంగుళూరుకు చెందిన మరో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ, రూరల్ సీఐ వై. శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ లతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయాల వారీగా ప్రభుత్వ సర్వేలన్నీ వెంటనే పూర్తి చేయాలి

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు




**గుంటూరు నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్:**

టీం వర్క్, ప్రణాళిక పక్కాగా ఉంటే ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతుందని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నగరపాలక సంస్థ విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి కార్యదర్శులు, నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల వారీగా పక్కాగా యాక్షన్ ప్లాన్, సంయుక్త కృషి ఉంటే కార్యక్రమాలు విజయవంత మవుతాయన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ విభాగ విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజధాని అమరావతి పర్యటన ఉన్నందున, పర్యటనలో జిఎంసి అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అలాగే ఈ నెల 19న ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ నెల ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ అంశం ఉంటుందన్నారు. ప్రతి డివిజన్ లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఆస్తి పన్నుపాత బకాయిలు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం, ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను ఏక మొత్తంగా చెల్లిస్తే మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు.

సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, పి.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశికి ఘాట్ రోడ్డు పూర్తి చేయాలి..

## - అధికారులతో సమీక్షించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

**వినుకొండ మేజర్ న్యూస్**



వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని తొలి ఏకాదశి పండుగ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. దేవాలయం,ఘాట్ రోడ్డు, గిరిప్రదర్శన రోడ్డు నిర్మాణంపై బుధవారం చీఫ్ విప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూలై 7వ తేదీ జరగబోవు తొలి ఏకాదశి పండుగ భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణానికి 5.90 కోట్లు, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణానికి 1.20 కోట్లు, రామలింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి 2 కోట్లు నిధులు మంజూరు చేయించానని, అలాగే దాతల సహకారంతో 6 నెలల్లో నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను చీఫ్ విప్ జీవి ఆదేశించారు. ఘాట్ రోడ్డు నిర్మాణం గతంలో జరిగిన తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ ప్లానింగ్ లేకుండా ఇష్టానుసారంగా ఘాట్ రోడ్డుకు బ్లాస్టింగ్లు చేయటం వలన కొండచిట్టు రాళ్లు నిలిచి ప్రమాద భరితంగా మారిందన్నారు. ఘాట్ రోడ్డు నిర్మాణంలో ఎటువంటి లోపాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నాణ్యత ప్రమాణాలతో దేవాలయం, గిరి ప్రదర్శన రోడ్డు, ఘాట్ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్లు, ఆర్టీసీ బస్సు పార్కింగ్, గ్రీనరీ, కరెంటు, త్రాగునీరు తదితర అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించి భక్తుల మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా ఆదేశించారు. రామలింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి వినుకొండ ప్రజల సహాయ సహకారాలు అందించాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి త్వరలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కొండపై మెట్ల మార్గాన్ని కూడా దాతల సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమీక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన, బిజెపి నాయకులు, పంచాయతీరాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, ద్వామా పిడి సిద్ధ లింగమూర్తి, ఆర్ అండ్ బి, పిఆర్, పి ఐ యు, ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రిసిటీ డి ఈ లు, ఏఈలు, దేవాదాయ శాఖ డీఈ, ఏఈ లు, ఈవోలు, ఫారెస్ట్, రెవిన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, వార్డు కౌనిసిలర్లు, దేవాలయ

# చదువుకున్న పాఠశాలకి అతిథిగా విచ్చేయడం సంతోషకరం : తోట వీరాంజనేయులు

వెల్దుర్తి, మేజర్ న్యూస్ : వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామం నందు ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శాలువాలు మరియు పూలమాలలతో స్థానికులు ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక టిడిపి యువ నాయకులు తోట వీరాంజనేయులు ను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోట వీరాంజనేయులు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు అతిథిగా విచ్చేయడం సంతోషకరమని అన్నారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేస్తామని పాఠశాల సిబ్బందికి భరోసా



ఇచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని, అదేవిధంగా తమ ప్రాంతంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి 900 కోట్ల రూపాయల నిధులను తెచ్చారని, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు, యువతకు నూతన ఉద్యోగ అవకాశాలను అందించేందుకు ఎమ్మెల్యే జూలకంటి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ. 100 కోట్లతో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి గ్రీన్ సిగ్నల్

- గుంటూరుకు ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు
- సీఎం సహకారంతో ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లాకు మరో రూ. 100 కోట్ల ప్రాజెక్ట్ ను మంజూరు చేయించారు. చేతి దాకా వచ్చిన హాస్పిటల్ ను మరో రాష్ట్రం తన్నుకు పోకుండా అడ్డుపడ్డారు. ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు జరపాలన్న ప్రతిపాదనను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకువెళ్లి మంత్రి వర్గ సమావేశంలో ఆమోదింపచేసుకున్నారు. ఫలితంగా గుంటూరు జిల్లా పరిధిలోని సుమారు లక్షకు పైగా కార్మికులకు ఉపయోగపడేలా వంద పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో పునాదిరాయి పడనుంది.

వివరాల్లోకి వెళితే.. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచి కేంద్ర ప్రభుత్వ పెండింగ్ ప్రాజెక్టులపై గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టి పెట్టారు. అందులో భాగంగా గుంటూరుకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్ గురించి ఆయన తెలుసుకున్నారు. ఈ క్రమంలో 2024, సెప్టెంబర్ లో కార్మిక శాఖ కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా గారితో పెమ్మసాని తొలుత లేఖ రాసి, సంప్రదించారు. గుంటూరు కార్మికుల సమస్యలు, ఇబ్బందుల గురించి మాండవియా గారికి సవివరంగా తెలియజేసిన పిదప కేంద్ర మంత్రి స్పందిస్తూ ఈఎస్ఐ హాస్పిటల్ ను గుంటూరుకు మంజూరు చేశారు. అందులో భాగంగా నిర్మాణానికి అవసరమయ్యే 6.35 ఎకరాల భూమిని ఉచిత ప్రాతిపదికన కేటాయింపు జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సూచించింది. అయితే అందుకు భిన్నంగా అవసరమైన భూమి నిమిత్తం ఎకరాకు రూ. 1.69 కోట్ల చొప్పున 6.35 ఎకరాలకుగానూ రూ. 10.77 కోట్ల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది.

**సీఎం చంద్రబాబు దృష్టికి**

భూ కేటాయింపులకు చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోరిన వివరాలపై సమాచారం అందుకున్న పెమ్మసాని తక్షణమే స్పందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు అంశాన్ని తీసుకువెళ్లారు. కాగా గుంటూరు జిల్లా కార్మికుల స్థితిగతులు, పెమ్మసాని ప్రయత్నం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని సహృదయంతో స్పందించి ఉచిత భూ కేటాయింపునకు ఆయన అంగీకారం తెలిపారు. ఇదే అంశాన్ని ఈనెల 15న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా ప్రవేశపెట్టి ఆమోదింప చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, కార్మిక శాఖ కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ కి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ కి, అధికారులకు తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

**ఉపయోగాలు :**

- గుంటూరు జిల్లా పరిధిలో ప్రస్తుతం సుమారు 5 ఈఎస్ఐ డిస్పెన్సరీలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇవి ప్రాథమిక చికిత్స కేంద్రాలుగా, అవుట్ పేషెంట్లకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి.
- ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో కలిపి ప్రస్తుతం నాలుగు ఈఎస్ఐ ఆసుపత్రులు పనిచేస్తున్నాయి.
- ఇవి కాకుండా అమరావతి రాజధాని ప్రాంతం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా 100 పడకలతో రూ. 100 కోట్ల ప్రతిపాదిత అంచనాతో ఈఎస్ఐ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.
- అయితే ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన ఈఎస్ఐ హాస్పిటల్ ను తమ రాష్ట్రానికి మళ్లించాలని కూడా కొన్ని రాష్ట్రాలు, నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒక దశలో ఒత్తిడి చేశారు.
- ఈ క్రమంలో ఉచిత ప్రాతిపదికన భూ కేటాయింపు అంశం ఆధారంగా మంజూరు అంశం ఆలస్యమై ఉంటే ఈ ఆసుపత్రి పక్క రాష్ట్రాలకి కేటాయించే అవకాశం కూడా లేకపోలేదు.
- అయితే ఆ పరిస్థితి రాకుండా అడ్డుపడ్డ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ఆంధ్రప్రదేశ్ నుంచి ఈఎస్ఐ ఆసుపత్రిని కదలనివ్వలేదు.
- తద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని కార్మికులకు కూడా ఈ ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు అందించనుంది.

# చేబ్రోలు మసీదు ఏరియా అంగన్‌వాడీ సెంటర్లో పౌష్టికాహార వారోత్సవాలు





**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తపేట మసీదు ఏరియాలోని అంగన్వాడీ సెంటర్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు సెక్టార్ సూపర్వైజర్ యు. పద్మజా ఆధ్వర్యంలో 10 కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె గర్భిణీ లకు , మహిళలకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకో వాలని చెప్పారు. బాలింతలు, తల్లులు, గర్భిణీలకు పలు సూచనలు చేశారు. చిన్నపిల్లల వెయ్యి రోజుల సంరక్షణ గురించి చక్కగా వివరించారు. వేసవికాలంలో తల్లులు, గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారాలు తయారు చేసుకునే విధానాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నపిల్లల బరువులు తూసి తక్కువ బరువు ఉన్న పిల్లల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలు సూపర్వైజర్ పద్మజ చక్కగా వివరించారు. ప్రతి ఒక్క మహిళ అనారోగ్య సమస్యల నుంచి బయటపడాలంటే మంచి పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ భరోసా .. మంగళదాస్ నగర్ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే నసీర్

- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్
- ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతామని భరోసా

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఒక్కొక్కటి గట్టెక్కుతున్నాయి. గత ప్రభుత్వ పాలనలో నిరాదరణకు గురైన నిర్భాగ్యులు, ఆదరణకు నోచుకోని కాలనీల వాసులు ప్రజా దర్బార్ వేదికగా ఎమ్మెల్యే నసీర్ వద్ద సాంత్వన పొందుతున్నారు. గుంటూరులోని మంగళ్ దాస్ నగర్‌లో బుధవారం ఎమ్మెల్యే నసీర్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, మురుగునీరు సమస్య, మంచినీటి వ్యవస్థ వంటి అంశాలపై అధికారం అర్జీలు అందజేశారు. అలాగే స్థానిక మంగళ దాస్ నగర్ లో ఉన్న నిర్విష్ఘ్నమైన కమ్యూనిటీ హాల్ ని సిఎస్ఆర్ నిదుర ద్వారా త్వరలో ప్రణాళికలు రూపొందించి పూర్తి చేస్తామని ప్రజలు అందించిన అన్ని సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ధైర్యం నింపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల సమస్యలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజాదర్బార్ తోపాటు ప్రతి రోజూ కాలనీలకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు. అనంతరం అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రిహానా , క్లస్టర్ ఇంచార్జ్ వేల్పూరు కిరణ్, చెట్టు కనకారావు, పల్లె పోగు రమేష్, చాట్ల విజయబాబు, బెనర్జీ మాస్టర్, ఇమ్రాన్, ఖాసీం వాసు, చారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు.. ఉత్తర్వులు జారీ

గుంటూరు, మేజర్ న్యూస్

ఏపీలో ఉచిత నిర్బంధపు విద్యా హక్కు చట్టం కింద( ఆర్టిఇ) ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల మేరకు 2025–26 విద్యాసంవత్సరానికి పేద కుటుంబాల పిల్లలకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలని పేర్కొంది. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం చేసే ఖర్చు ఆధారంగా వ్యయాన్ని అంచనా వేసేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. అది నిర్ణయించిన ఫీజును ప్రభుత్వమే భరించనుంది.


నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రిక సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455
జి.హిరణ్మాయి(కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
చెట్టిపోగు కాశి దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951
చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
ఎస్.కె.రఫీ చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 99493352147
జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
లక్ష్మీనారాయణ రెంటచింతల రిపోర్టర్ సెల్ : 800079075
వి.వెంకటరెడ్డి బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991
పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
సి.హెచ్.ప్రసాద్ గుంటూరు సిటీ రిపోర్టర్ సెల్ : 8125309319
పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
జి.బాలాజీ తాడికొండ రిపోర్టర్ సెల్ : 9603424824
రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
తేళ్ల రవీంద్రబాబు గుంటూరు రిపోర్టర్ సెల్ : 7396234032

"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.